సాక్షి
అనంతపురం

మంగళవారం । 15 । ఆగస్టు । 2023



చీనీ టన్ను రూ.16 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.16 వేలు పలికాయి. మార్కెట్‌కు 499 టన్నుల కాయలు వచ్చాయి.



టమాట @ 60

కక్కలపల్లి మండీలో సోమవారం టమాట కిలో గరిష్ట ధర రూ.60 పలికింది. కనిష్టంగా రూ.40, సరాసరిన రూ.50 ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
38.2°/22.6°

జిల్లా అంతటా సోమవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఒకట్రెండు చోట్ల తేలికపాటి జల్లులు పడ్డాయి.

న్యూస్‌రీల్

సుబ్రహ్మణ్యుని సేవలో హైకోర్టు జడ్జి



సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకుంటున్న హైకోర్టు న్యాయమూర్తి మన్మధరావు

ఆత్మకూరు: పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని సోమవారం హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ మన్మధరావు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ దుబ్బ చంద్రశేఖర్‌రెడ్డి హైకోర్టు జడ్జికి శాలువా కప్పి సన్మానించారు. స్వామి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉషారాణి, మాజీ సర్పంచ్ వన్నూరప్ప, అర్చకులు రాము, సీతారామ్మోహన్ శర్మ, జయరాం శర్మ, సాయి తదితరులు పాల్గొన్నారు.

నెట్టికంటుడి హుండీ ఆదాయం రూ.23 లక్షలు



హుండీ నగదును లెక్కిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానానికి హుండీ కానుకల ద్వారా రూ.23.03 లక్షల ఆదాయం లభించినట్లు ఈఓ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆలయంలో హుండీ కానుకల లెక్కింపు చేపట్టారు. 41 రోజులకు గాను భక్తులు హుండీలో వేసిన కానుక రూపంలో రూ.23,03,666, అన్నదాన హుండీ ద్వారా రూ.25,580 సమర్పించినట్లు ఈఓ తెలిపారు. లెక్కింపును ఆలయ పాలకమండలి సభ్యులు, అధికారులు, తదితరులు పర్యవేక్షించారు. ఆర్టీసీ సేవాసమితి సభ్యులు, బళ్లారికి చెందిన వీరభద్రసేవా సమితి సభ్యులు హుండీ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.

జీబీసీకి 250 క్యూసెక్కుల నీరు



ఉరవకొండ: నింబగల్లు హెచ్చెల్సీ హెడ్ రెగ్యులేటరీ వద్ద గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ (జీబీసీ)కు 250 క్యూసెక్కుల నీటిని సోమవారం మళ్లించినట్లు డీఈ రఘుచందన్ తెలిపారు. తాగునీటి పథకాలకు మాత్రమే అందిస్తున్నామన్నారు. ఐఏబీ సమావేశం తరువాత ఆయకట్టుకు సాగునీరందిస్తామని తెలిపారు. జిల్లాలోని విడపనకల్లు, గడేకల్లు, ఛాయాపురం, గుంతకల్లుతో పాటు కర్నూలు జిల్లాలోని ఖాజీపురం గ్రామాల్లోని తాగునీటి పథకాలకు తుంగభద్ర జలాలను మళ్లించినట్లు చెప్పారు.

తొలి పెయ్య దూడ జననం



పెయ్య దూడను చూపుతున్న రైతు నరసింహులు

రాప్తాడు: పాడి రైతుల ఆర్థిక బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పశువుల్లో కృత్రిమ గర్భధారణ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో తొలి పెయ్య దూడ సోమవారం జన్మించింది. వివరాలను జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఈఓ సుధాకర్, రాప్తాడు పశువైద్యాధికారి డాక్టర్ సోమేశ్వరి వెల్లడించారు. పెయ్య దూడల ఉత్పత్తి పథకంలో భాగంగా లింగ నిర్ధారిత వీర్యంతో రాప్తాడు మండలం ఎం.బండమీదపల్లి పాడి రైతులకు చెందిన 23 పశువులకు కృత్రిమ గర్భధారణ చేయించారు. వీటిలో 15 పశువులకు కట్టు నిలిచింది. గత ఏడాది నవంబర్ 4న కృత్రిమ గర్భధారణ చేయించిన పాడి రైతు నరసింహులు ఆవు సోమవారం పెయ్య దూడకు జన్మనిచ్చింది. భవిష్యత్తులో లింగ నిర్ధారిత వీర్యం అత్యధిక ప్రాచుర్యం పొందుతుందని, గ్రామంలో అత్యధికంగా పెయ్య దూడలు జన్మించే అవకాశముందని పశువైద్యాధికారులు పేర్కొన్నారు.



77వ స్వాతంత్య్ర వేడుకలకు ముస్తాబైన పోలీస్ పరేడ్ మైదానం



సుందరంగా తీర్చిదిద్దిన వేదిక



విద్యుత్ వెలుగుల్లో కలెక్టర్ కార్యాలయం

వేడుకలకు సర్వం సిద్ధం

అనంతపురం అర్బన్: స్వాతంత్య్ర వేడుకలకు అనంతపురం పోలీస్ పరేడ్ మైదానం సిద్ధమైంది. మంగళవారం ఉదయం 9.02 గంటలకు జాతీయ పతాకాన్ని ముఖ్య అతిథి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆవిష్కరిస్తారు. తర్వాత సాయుధ బలగాల గౌరవవందనం స్వీకరిస్తారు. మంత్రి జిల్లా ప్రజలకు తన సందేశం వినిపిస్తారు. ప్రభుత్వ పథకాలపై రూపొందించిన శకటాల ప్రదర్శన, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తారు. విధి నిర్వహణలో ఉత్తమసేవలందించిన 256 మంది ఉద్యోగులు, 16 మంది అధికారులు మొత్తం 272 మందికి ప్రశంసాపత్రాలు ప్రదానం చేయనున్నారు. తరువాత వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలిస్తారు. సోమవారం పరేడ్ మైదానంలో ఏర్పాట్లను ఎస్పీ శ్రీనివాసరావు పరిశీలించారు. రిహార్సల్స్ నిర్వహించారు. ఇదిలా ఉండగా 77వ స్వాతంత్య్ర వేడుకల సందర్భంగా కలెక్టర్ కార్యాలయం నూతన శోభను సంతరించుకుంది.

సమీక్షలతో సత్ఫలితాలు





సమీక్షకు హాజరైన అధికారులు, మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్రంలో విప్ కాపు, ఎంపీ రంగయ్య, ఎమ్మెల్యేలు అనంత, పద్మావతి, కలెక్టర్ గౌతమి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ తదితరులు

- అభివృద్ధి పనుల పూర్తిపై దృష్టి
- ఎమ్మెల్యేల సూచనలకు ప్రాధాన్యత
- సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు
- జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

అనంతపురం సిటీ: నియోజకవర్గ సమీక్షలు సత్ఫలితాలిస్తున్నాయని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. నియోజకవర్గాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, వివిధ సమస్యల పరిష్కారానికి సమీక్షల్లోనే చర్యలు తీసుకోవడంతో ప్రభుత్వంపై ప్రజల్లో మరింత విశ్వసనీయత పెరుగుతోందన్నారు. సోమవారం జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలోని డీపీఆర్‌సీ భవన్‌లో నాలుగు నియోజకవర్గాల సమీక్షలు నిర్వహించారు. తొలుత అనంతపురం అర్బన్, తర్వాత రాయదుర్గం, ఉరవకొండ, శింగనమల నియోజకవర్గాల సమీక్షలు జరిగాయి. ముఖ్య అతిథిగా జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి హాజరయ్యారు. విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎంపీ రంగయ్య, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, ఎమ్మెల్యేలు అనంత వెంకట్రామిరెడ్డి, జొన్నలగడ్డ పద్మావతి, ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, ప్రభుత్వ సలహాదారు (విద్య) ఆలూరి సాంబశివారెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఏడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ లిఖిత, కలెక్టర్ గౌతమి, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు ఏడు నియోజకవర్గాల సమీక్షలు పూర్తి చేశామని తెలిపారు. ఇందులో తొలుత తక్కువ నిధులతో పూర్తయ్యే పనులు, తర్వాత ప్రభుత్వం కొద్దిపాటి నిధులు సమకూరిస్తే పూర్తి చేయగలిగినవి, మూడో ప్రాధాన్యతగా ఇప్పటికిప్పుడు పూర్తికాకపోయినా ఎన్నికల తర్వాత పూర్తయ్యే వాటికి ముందస్తుగా అనుమతులు, సాంకేతిక మంజూరు తీసుకుని పనులు మొదలు పెట్టాలనే అంశంపై చర్చించామన్నారు. ఎమ్మెల్యేలు ఆయా నియోజకవర్గాల్లోని సమస్యలను తమ దృష్టికి తెచ్చారన్నారు. వాటిని కలెక్టర్ పరిగణనలోకి తీసుకొని వారి పరిధిలో పరిష్కరించగలిగినవి పూర్తి చేస్తారన్నారు. మిగిలిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి నివేదిక రూపంలో తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ఎమ్మెల్యేల్లో మనోధైర్యం పెంచేలా, అడిగినవన్నీ ప్రభుత్వం చేస్తుందనే ఆలోచన వారిలో తెచ్చేలా సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమీక్షల్లో తమ దృష్టికి వచ్చిన సమస్యలను అధికారులు తప్పకుండా పరిష్కరించాలని మంత్రి పెద్దిరెడ్డి ఆదేశించారు. జగనన్న కాలనీల్లో గడువులోగా లక్ష్యాలు పూర్తి చేయాలని ఆదేశించారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి సంబంధించి పీఆర్ శాఖలో పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఉపాధి హామీలో డిస్ట్రిబ్యూటరీల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపాలని పేర్కొన్నారు. వైఎస్సార్ జలకళ కింద విద్యుత్ మోటార్లు పంపిణీ చేయాలని ఆదేశించారు. అర్హులైన రైతులకు ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు అందించాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించడంలో అధికారులు జాప్యం చేయరాదన్నారు. సమీక్షల్లో మేయర్ వసీం సలీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ట్యాంక్‌బండ్ నిర్మించండి



అనంతపురం చెరువు కట్టపై ట్యాంక్ బండ్ నిర్మాణానికి రూ.10కోట్లు ఇవ్వాలి. చెరువుకట్ట, రోడ్డు పూర్తిగా పాడైంది. వాటికి నిధులు ఇవ్వండి. అనంతపురానికి 25 వేల ఇళ్లు మంజూరు చేశారు. అందులో 18 వేల ఇళ్లకు అనుమతి ఇచ్చారు. వెంటనే అధికారులు ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలి. కామారుపల్లి లేఅవుట్‌లో నీళ్లు ఊరుతున్నాయి. కొన్ని లేఅవుట్లు కోర్టులో ఉన్నాయి. టిడ్కో ఇళ్లు పూర్తి చేయండి. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇళ్ల కోసం మళ్లీ 9 వేల అర్జీలు వచ్చాయి. వెంటనే భూసేకరణ చేపట్టాలి. – అనంత వెంకట్రామిరెడ్డి, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే

మరమ్మతులు చేపట్టండి



గార్లదిన్నె మండల పరిధిలోని మిడ్ పెన్నార్ రిజర్వాయర్ (ఎంపీఆర్) మరమ్మతులకు రూ.5 కోట్లు అవసరం. దక్షిణ కాలువ–1 నుంచి 20వ డిస్ట్రిబ్యూటర్ వరకు పూడికతీత చేపట్టాలి. హెచ్చెల్సీ నుంచి శింగనమల చెరువుకు చానల్ ఏర్పాటు చేయాలి. పుట్లూరు మండలం మడుగుపల్లి లిఫ్ట్ ఇరిగేషన్‌కు రూ.5 కోట్లు మంజూరు చేయాలి. – జొన్నలగడ్డ పద్మావతి, ఎమ్మెల్యే, శింగనమల

హంద్రీ–నీవా నీరు వదలాలి



హంద్రీ–నీవా ద్వారా చెరువులు, పిల్ల కాలువలకు నీరివ్వాలి. కాలువ, గట్లను మరమ్మతులు చేయాలి. ఉరవకొండ నియోజకవర్గానికి 2,500 జగనన్న ఇళ్లు మంజూరయ్యాయి. వాటికి వెంటనే పాలనాపర అనుమతులు ఇవ్వాలి. ఉరవకొండ సహా గ్రామాల్లో 800 మంది లబ్ధిదారులకు సంబంధించిన ఇళ్ల పట్టాల కేసులు కోర్టుల్లో పెండింగ్ ఉన్నాయి. వాటిని సత్వరం పరిష్కరించాలి. – వై.విశ్వేశ్వరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, ఉరవకొండ

డ్రెయిన్లకు ప్రత్యేక గ్రాంట్



రాయదుర్గం మున్సిపాలిటీలో డ్రెయినేజీల నిర్మాణానికి రూ.20 కోట్ల ప్రత్యేక గ్రాంట్ ఇవ్వాలి. నేమకల్లు ఆంజనేయ స్వామి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ డీపీఆర్ కోసం అవసరమైన నిధులు ఇవ్వాలి. హెచ్ఎన్ఎస్ఎస్ 36వ ప్యాకేజీ పనులు పూర్తి చేయాలి. బీటీపీ కెనాల్ పరిధిలో వంతుల వారీగా నీరివ్వాలి. కణేకల్లు చెరువు, రెగ్యులేటరీ మరమ్మతులు చేయాలి. రాయదుర్గం బైపాస్ రోడ్డు కోసం భూసేకరణ వేగవంతం చేయాలి. – కాపు రామచంద్రారెడ్డి, ప్రభుత్వ విప్, రాయదుర్గం

చెరువుల్లో పూడికతీయాలి



ఉరవకొండ నియోజకవర్గంలోని చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టాలి. తాగునీటి సమస్య పరిష్కారానికి చొరవచూపాలి. ఇళ్లు కట్టుకుంటామంటూ ముందుకొచ్చే వారికి ఇళ్లు మంజూరు చేయాలి. పెంచలపాడు–కొలికి రోడ్డు పనులు పూర్తి చేయాలి. – వై.శివరామిరెడ్డి, ఎమ్మెల్సీ

అర్జీలు రీ–ఓపెన్ కాకూడదు

- నాణ్యమైన పరిష్కారం చూపాలి : జేసీ



అర్జీదారుల సమస్య వింటున్న జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'స్పందన', 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాల ద్వారా ప్రజల నుంచి వచ్చే అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని, అర్జీలు రీ – ఓపెన్ కాకుండా చూసుకోవాలని జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన 'స్పందన'లో జాయింట్ కలెక్టర్‌తో పాటు అసిస్టెంట్ కలెక్టర్ కుశాల్‌జైన్, డీఆర్‌ఓ గాయత్రీదేవి, డిప్యూటీ కలెక్టర్లు శ్రీనివాసులు, శంకరయ్య ప్రజల నుంచి వివిధ సమస్యలపై 444 అర్జీలు స్వీకరించారు. కార్యక్రమం అనంతరం 'స్పందన', 'జగనన్నకు చెబుదాం' అర్జీల పరిష్కారంపై అధికారులతో జేసీ సమీక్షించారు. సమస్య పరిష్కారంపై అర్జీదారులు సంతృప్తి చెందకపోతే వారి అర్జీ రీ–ఓపెన్ అవుతుందన్నారు. ప్రతి అర్జీకీ నాణ్యమైన పరిష్కారం చూపించడంతో పాటు అర్జీదారుకు ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని ఆదేశించారు. గడువుకు ముందే అర్జీలను పరిష్కరించాలని ఆదేశించారు.

పేరెంట్స్ కమిటీ చైర్మన్లతో జెండా ఆవిష్కరించాలి

రాప్తాడురూరల్: అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో మంగళవారం స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా పేరెంట్స్ కమిటీ చైర్మన్లతోనే జాతీయ జెండా ఎగురవేయించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్ ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్లు అందుబాటులో లేకపోతే హెచ్ఎంలు జెండా ఎగురవేయాలని సూచించారు. అనంతపురం టీటీడీసీలో శిక్షణలో పాల్గొంటున్న ప్రధానోపాధ్యాయుల స్థానంలో ఇన్‌చార్జ్ హెచ్ఎంలు స్వాతంత్య్ర వేడుకలు నిర్వహించాలని ఆదేశించారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



వ్యాసరచన విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న డీఈఓ సాయిరామ్

రాప్తాడురూరల్: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ అంశాలపై జిల్లాస్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు సోమవారం బహుమతులు అందజేశారు. వ్యాసరచన పోటీల్లో వజ్రకరూరు కేజీబీవీ పదో తరగతి విద్యార్థిని కె.సుకన్య ప్రథమస్థానం, 9వ తరగతి విద్యార్థిని ఎన్.షాహిని ద్వితీయ బహుమతి, రాప్తాడు మోడల్ స్కూల్ టెన్త్ విద్యార్థిని యు.శ్రీచైత్ర తృతీయ స్థానంలో నిలిచారు. వక్తృత్వ పోటీల్లో గార్లదిన్నె కేజీబీవీ పదో తరగతి విద్యార్థిని జి.హర్షిత ప్రథమస్థానం, పామిడి మోడల్ స్కూల్ పదో తరగతి విద్యార్థిని కె.శ్రావణి ద్వితీయ స్థానం, అనంతపురం ప్రభుత్వ నంబర్–2 స్కూల్ విద్యార్థి ఎస్.ఫిర్దోస్ తృతీయస్థానంలో నిలిచారు. అనంతపురం కేఎస్ఆర్ ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఈఓ సాయిరామ్, జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి వెంకటరమణ నాయక్, డీవైఈఓ పద్మప్రియ చేతుల మీదుగా విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎంలు నవీద, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధికి పునరంకితం



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎంపీ రంగయ్య, ఎమ్మెల్యే అనంత, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, కలెక్టర్ గౌతమి తదితరులు

అనంతపురం సిటీ: ప్రతి ఒక్కరూ జాతీయభావంతో దేశాభివృద్ధికి పునరంకితమవుదామని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా 'నా భూమి–నా దేశం' నినాదంతో సోమవారం 'నేల తల్లికి నమస్కారం', 'వీరులకు వందనం' జిల్లా స్థాయి కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. కార్యక్రమానికి ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎంపీ రంగయ్య, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, కలెక్టర్ ఎం.గౌతమి, ప్రభుత్వ విద్యా సలహాదారుడు ఆలూరి సాంబశివారెడ్డి, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల, ఏడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ లిఖిత, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య, బీసీ సెల్ రీజనల్ కో–ఆర్డినేటర్ బీసీ రమేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. 'నా భూమి–నా దేశం' కింద వీరులను స్మరిస్తూ, వారికి వందనం చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. దేశ రాజధానికి తరలించేందుకు జిల్లా నుంచి సేకరించిన మట్టి కలశాన్ని మంత్రి పెద్దిరెడ్డికి కలెక్టర్ అందజేశారు. భూమికి వందనం చేస్తూ పంచ్‌ప్రాణ్ ప్రతిజ్ఞ చేయించారు. 'వసుధకు వందనం' కింద మొక్కలు నాటారు. దేశ నిర్మాణం ఒక మహా యజ్ఞమని, ఈ క్రతువులో ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని మంత్రి కోరారు. కార్యక్రమంలో సైనిక సంక్షేమ శాఖ ఉమ్మడి జిల్లా అధికారి జల్లా శ్రీనివాసులు, జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి, డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి సహా వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.

22న మెగా జాబ్‌మేళా

రాప్తాడు రూరల్: అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో ఈ నెల 22న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఏసీఆర్ దివాకర్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 50 దాకా సాఫ్ట్‌వేర్, ఇతర కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయని వెల్లడించారు. అనంతపురం, శ్రీ సత్యసాయి, నంద్యాల జిల్లాల నుంచి ప్రభుత్వ కళాశాలల డిగ్రీ తృతీయ సంవత్సర విద్యార్థులు హాజరుకావాలని సూచించారు. ఇప్పటికే ఏపీ సీసీఈ జాబ్‌పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకున్న విద్యార్థులే కాకుండా కొత్త వారికీ అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 97049 26192 నంబరులో సంప్రదించాలని సూచించారు.

లైబ్రేరియన్‌కు దేహశుద్ధి

- విద్యార్థినులతో అసభ్యకర ప్రవర్తన
- ఆగ్రహించిన బాధితుల తల్లిదండ్రులు
- ప్రిన్సిపాల్‌కు లిఖితపూర్వక ఫిర్యాదు



భానుప్రకాష్ నాయక్



భానుప్రకాష్ నాయక్‌పై దాడి చేస్తున్న తల్లిదండ్రులు


అనంతపురం: అభం శుభం తెలియని పసి మొగ్గల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు లైంగిక వేధింపులకు పాల్పడుతున్న కేంద్రీయ విద్యాలయం లైబ్రేరియన్ భానుప్రకాష్‌నాయక్‌కు బాధిత విద్యార్థినుల తల్లిదండ్రులు దేహశుద్ధి చేశారు. బాధితుల కథనం మేరకు... శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లోని కేంద్రీయ విద్యాలయంలో ఒకటి నుంచి పదో తరగతి వరకు 400 మంది బాలబాలికలు చదువుకుంటున్నారు. ఇందులో 150 మంది దాకా బాలికలు ఉన్నారు. లైబ్రరీ అవర్ ఉన్న రోజు అమ్మాయిలు హడలెత్తిపోతున్నారు. పాఠశాలకు వెళ్లబోమంటూ మొండికేస్తున్నారు. తల్లిదండ్రులు ఆరా తీస్తే విస్తుపోయే విషయాలు చెప్పారు. లైబ్రేరియన్ భానుప్రకాష్‌నాయక్ తమ లోదుస్తుల రంగు చెప్పమంటారని, ఆయన ప్రైవేట్ పార్ట్స్‌పై మసాజ్ చేయాలని ఒత్తిడి చేస్తాడని, చెప్పినట్టు వినకపోతే బండబూతులు తిడుతున్నారని పలువురు విద్యార్థులు చెప్పారు. మూడు, నాలుగు తరగతులు చదువుతున్న బాలికలు ఆ విషయాలు చెబుతుంటే తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోయారు. సోమవారం విద్యాలయానికి చేరుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు లైంగిక వేధింపుల ఘటనపై ప్రిన్సిపాల్ కరీంఖాన్‌కు ఫిర్యాదు చేశారు. ఒక అమ్మాయిని అకారణంగా స్కేలుతో కొట్టి అవమానించారని కూడా అందులో పేర్కొన్నారు. అనంతరం లైబ్రేరియన్‌ను ప్రిన్సిపాల్ వద్దకు పిలుచుకొచ్చారు. లైబ్రేరియన్‌పై విద్యార్థుల తల్లిదండ్రులు మూకుమ్మడిగా భౌతికదాడి చేశారు. ఇంతలోనే పోలీసులు వచ్చి పరిస్థితిని అదుపుచేశారు. ఇదిలా ఉండగా.. లైబ్రేరియన్ తాను ఏతప్పూ చేయలేదంటున్నాడు. ఇదివరకు ఉన్న ప్రిన్సిపాల్‌కు తానంటే గిట్టదని, ఆయనే ఉద్దేశపూర్వకంగా తనపైకి విద్యార్థినుల తల్లిదండ్రులను ఉసిగొల్పుతున్నాడని చెప్పుకొచ్చాడు.

డిప్యూటీ సెక్రటరీకి నివేదిక ..

లైబ్రేరియన్‌పై ఫిర్యాదు, భౌతికదాడి ఘటనకు సంబంధించి ప్రిన్సిపాల్ కరీంఖాన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కేంద్రీయ విద్యాలయం డిప్యూటీ సెక్రటరీకి పూర్తిస్థాయి నివేదిక పంపించారు. లైబ్రేరియన్ భానుప్రకాష్‌నాయక్ ఒక విద్యార్థినిని స్కేలుతో కొట్టారని నిర్ధారించారు. జరిగిన ఘటనపై కేంద్రీయ విద్యాలయం చైర్మన్, ఎస్కేయూ వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డికి ప్రిన్సిపాల్ నివేదించారు. తల్లిదండ్రులతోనూ, విద్యార్థులందరితోనూ మరోసారి విచారణ చేసి నివేదిక పంపాలని వీసీ ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు.

త్యాగధనుల ఖిల్లా 'అనంత'

స్వాతంత్ర్య సంగ్రామంలో ఉమ్మడి అనంతపురం జిల్లాకు విడదీయరాని బంధం ఉంది. ఆంగ్లేయులపై తిరుగుబాటు జెండా ఎగురవేసిన ఎందరో త్యాగధనులు పుట్టిన పుణ్యభూమిగా ఖ్యాతిగాంచింది. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా స్వాతంత్ర్య సమర యోధుల జీవిత విశేషాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం.


కళ్యాణదుర్గంలో వెలసిన ఓబయ్య విగ్రహం

కళ్యాణదుర్గం: కంబదూరుకు చెందిన ఓబయ్య.. అదే గ్రామంలోని పాఠశాలలో విద్యాభ్యాసం ప్రారంభించి 1937లో ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించారు. అంటరానితనానికి వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు కంబదూరులో 70 మంది హరిజనులను సమీకరించి పాఠశాలను ప్రారంభించారు. ఈ క్రమంలోనే నీలం సంజీవరెడ్డి, తరిమెల నాగిరెడ్డి, ఐదుకల్లు సదాశివన్, పెడబల్లి చిదంబరరెడ్డి, విద్వాన్ విశ్వం, గుత్తి రామకృష్ణ తదితరులతో కలసి స్వాతంత్ర్య ఉద్యమంలోకి కాలు పెట్టారు. అప్పట్లో బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓబయ్య చేసిన ప్రసంగాలు స్ఫూర్తిదాయకంగా నిలిచాయి. వ్యక్తి సత్యాగ్రహంలో పాల్గొన్నందుకు ఓబయ్య టీచర్ సర్టిఫికెట్‌ను ప్రభుత్వం రద్దు చేసింది. 1942లో బ్రిటీష్ ప్రభుత్వం అణచివేత ఎక్కువ కావడంతో కాంగ్రెస్ హై కమాండ్ ఆదేశాలతో అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. అదే ఏడాది ఆగస్టు 25న ప్రభుత్వ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారంటూ ఓబయ్యను బ్రిటీష్ ప్రభుత్వం అరెస్ట్ చేసి, అనంతపురం సబ్‌జైలుకు తరలించింది. క్షమాపణకు ఓబయ్య నిరాకరించడంతో బళ్లారి సబ్‌జైలుకు తరలించారు. స్వాతంత్ర్య వచ్చిన తర్వాత 1972–78 మధ్య కాలంలో ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో ఓబయ్య ఎమ్మెల్సీగా ప్రజాసేవ చేశారు. అంతకు ముందు ఆర్డీఓ అధ్యక్షతన సమితి ఉపాధ్యక్షుడిగా, కంబదూరు సమితి అధ్యక్షుడిగా పనిచేశారు.

నరసింహమై గర్జించాడు



అనంతపురం కల్చరల్: 'క్షమాపణ చెప్పు నిన్ను వదిలేస్తాం. లేదంటే 27 కొరడా దెబ్బలు, ఆరు నెలల కఠిన కారాగార శిక్ష తప్పదు' అని తీవ్రంగా హెచ్చరించిన పోలీసుల ముందు ఆత్మగౌరవాన్ని ప్రదర్శించిన కాటప్పగారి నరసింహారెడ్డిది అనంతపురం రూరల్ మండలం పూలకుంట గ్రామం. 1921 జన్మించిన ఆయన మదనపల్లిలో ఎస్ఎస్ఎల్‌సీ చదువుకుంటున్న రోజుల్లో మహాత్ముడి ప్రసంగాలతో చైతన్యం పొంది స్వాతంత్ర్య ఉద్యమాల్లో పాల్గొంటూ వచ్చారు. బ్రిటీష్ పాలకులకు కొరకరాని కొయ్యగా మారారు. తమ గ్రామంలో హరిజన వాడకు 7 ఎకరాల సొంత భూమిని దానంగా ఇచ్చారు. ప్రాథమిక వైద్య కేంద్రం, పాఠశాలకు భూములు దానమివ్వడమే కాకుండా అనేక ఆలయాలకు సొంత భూమిని విరాళంగా అందజేశారు.

గాంధీజీ మాటే శిరోధార్యంగా


త్యాగధనుల గుర్తుగా ఏర్పాటు చేసిన స్మారకచిహ్నం

రాయదుర్గం టౌన్: గాంధీజీ మాటే శిరోధార్యంగా స్వాతంత్ర్య ఉద్యమంలో రాయదుర్గం వాసులు ప్రధాన భూమికను పోషించారు. వరదా చెన్నప్ప, తిప్పయ్య, గురుమాల్ నాగభూషణం, డాక్టర్ ఆర్.నాగన్నగౌడ్, ఓబుళాచార్యులు, కెరె శరణప్ప, ఎన్‌సీ శేషాద్రి, జగన్నాథసింగ్, నిప్పాణి రంగరావు, వై.హెచ్. సుబ్బారావు, వై.హెచ్.సత్యభామాదేవి, మోపూరు చంద్రకాంతనాయుడు, నాగిరెడ్డిపల్లి నివాసి కట్టరావుప్ప.. తదితరులు స్వాతంత్ర్యోద్యమంలో పాలు పంచుకున్నారు. స్వాతంత్ర్య పోరాటంలో అరెస్ట్ అయి మూడు నెలల కఠిన కారాగార శిక్ష అనుభవించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1952లో రాయదుర్గం నియోజకవర్గానికి తొలి ఎమ్మెల్యేగా గురుమాల్ నాగభూషణం పనిచేశారు. త్యాగధనుల గుర్తుగా 74 ఉడేగోళంలో స్మారక స్తూపాన్ని భారత ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

ఉద్యమకారుల ఆకలి తీర్చి


దామోదర్‌సింగ్

రాయదుర్గం: జాతిపిత మహాత్మా గాంధీ బాటలో నడిచి గుమ్మఘట్ట మండలం సిరిగేదొడ్డికి చెందిన దామోదర్‌సింగ్ జైలు జీవితం అనుభవించారు. 1918లో జన్మించిన ఆయన 1942లో క్విట్ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలు జీవితం అనుభవించారు. వంటలు చేయడంలో సిద్ధహస్తుడైన ఆయన రుచికరమైన ఆహార పదార్థాలు చేసి ఉద్యమకారుల ఆకలి తీర్చేవారు. 2000వ సంవత్సరంలో ఆదోని వద్ద చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఆయన మృతి చెందారు.

పోరాటం విలక్షణం


ఆదినారాయణరెడ్డి, అన్నపూర్ణమ్మ దంపతులు

అనంతపురం కల్చరల్: అనంత స్వాతంత్ర్య సమరయోధుల్లో చిరస్మరణీయ పాత్ర పోషించిన వారిలో వేములేటి ఆదిరానాయణరెడ్డి ఒకరు. శ్రీసత్యసాయి జిల్లా గుట్టూరు మండలం చిన్నప్పరెడ్డి పల్లిలో జన్మించిన ఆయన కొత్తచెరువు మండలం లోచర్లలో స్థిరపడ్డారు. బాల్యంలో పెనుకొండలో విద్యనభ్యసించే సమయంలోనే కమ్యూనిస్టు పార్టీ తరఫున అనేక సత్యాగ్రహాలు, ఉద్యమాల్లో పాలుపంచుకున్నారు. తర్వాతి రోజుల్లో బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పూర్తి స్థాయి స్వాతంత్ర్య ఉద్యమంలోకి కాలు పెట్టారు. 1941లో పోలీసులు అరెస్ట్ చేసి బళ్లారి సెంట్రల్ జైలుకు తరలించారు.

స్వాతంత్ర్య స్మృతి చిహ్నం



దేశ స్వాతంత్ర్య స్మృతి చిహ్నంగా అనంతపురంలో టవర్ క్లాక్ వెలిసింది. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన సంవత్సరం (1947)కి గుర్తుగా 47 అడుగుల ఎత్తుతో నిర్మించారు. అలాగే 15వ తేదీ స్ఫురణకు వచ్చేలా 15 అడుగుల వెడల్పు, ఆగస్టు నెల గుర్తుకు వచ్చేలా 8 భుజాలతో సుందరంగా నిర్మించారు. 1952లో అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఈ టవర్ క్లాక్‌ను ప్రారంభించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

రైతుల సంక్షేమమే సర్కారు ధ్యేయం

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి


డ్రిప్ పరికరాల వాహనానికి జెండా ఊపుతున్న మంత్రి పెద్దిరెడ్డి (చిత్రంలో) విప్ కాపు రామచంద్రారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, కలెక్టర్ గౌతమి తదితరులు

అనంతపురం సిటీ: రైతుల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకున్న రైతులకు ఏపీ ఎంఐపీ ఆధ్వర్యంలో డ్రిప్, స్ప్రింక్లర్లను సోమవారం మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేశారు. రాయదుర్గం నియోజకవర్గానికి సంబంధించి సబ్సిడీ పోను తమ వాటా చెల్లించిన 71 మంది రైతులకు సమారు రూ.2.2 కోట్ల విలువ చేసే తొమ్మిది లారీల డ్రిప్, స్ప్రింక్లర్లను రైతులకు అందజేశారు. ఉరవకొండ నియోజకవర్గానికి సంబంధించి 63 మంది రైతులకు రూ.82 లక్షల విలువ చేసే ఏడు లారీల పరికరాలు పంపిణీ చేశారు. శింగనమల నియోజకవర్గానికి సంబంధించి 89 మంది రైతులకు రూ.2.5 కోట్ల విలువ చేసే 12 లారీల పరికరాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు అనంత వెంకట్రామిరెడ్డి, జొన్నలగడ్డ పద్మావతి, ఉరవకొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి, కలెక్టర్ ఎం.గౌతమి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

'పోలీసు స్పందన'కు 144 వినతులు


పిటిషనర్‌తో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 144 వినతులు అందాయి. ఎస్పీ కె.శ్రీనివాసరావు స్వయంగా అర్జీలు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. సమస్య తీవ్రత తెలుసుకుని పరిష్కారానికి చర్యలు చేపట్టాలంటూ సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. ఓ కేసు నమోదు విషయంగా నిర్లక్ష్యం కనబరిచిన కళ్యాణదుర్గం ఎస్ఐ సుధాకర్‌ని స్పందన గ్రీవెన్స్‌కు పిలిపించుకుని బాధితుల ఎదుటే చీవాట్లు పెట్టారు. ఫిర్యాదు చేస్తే ముందస్తుగా కేసు ఎందుకు నమోదు చేయలేదో చెప్పాలని ప్రశ్నించారు. అనంతరం బాధితురాలితో మాట్లాడి న్యాయం చేస్తామని భరోసానిచ్చి పంపారు. కాగా, ఇదే కేసులో ఎస్ఐ సుధాకర్‌పై చర్యలు తీసుకోవాలంటూ ఎస్సీ, ఎస్టీ జేఏసీ అధ్యక్షుడు సాకే హరి డిమాండ్ చేశారు. బాధితురాలితో కలసి ఎస్పీకు వినతిపత్రం అందజేశారు. అలాగే పొలంలో నాటిన జామ మొక్కలు పీకేశారంటూ గార్లదిన్నె మండలం కోటంక గ్రామానికి హరిజన సుంకమ్మ కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. 1960లో ప్రభుత్వం ఇచ్చిన 5 ఎకరాల భూమిని వెంకట్రామిరెడ్డి అనే వ్యక్తి ఆన్‌లైన్‌లో అక్రమంగా తన పేరు ఎక్కించుకుని ఇబ్బంది పెడుతున్నాడని వాపోయారు. పీకేసిన జామ మొక్కలు తీసుకువచ్చి ఎస్పీకి చూపించారు. స్పందించిన ఎస్పీ ఘటనపై కేసు నమోదు చేయాలంటూ గార్లదిన్నె పోలీసులకు సిఫారసు చేశారు.

19న పంచాయతీ ఉప ఎన్నికలు

అనంతపురం రూరల్: వివిధ కారణాలతో ఖాళీగా ఉన్న రెండు సర్పంచ్, 33 వార్డు స్థానాలకు ఈ నెల 19న ఉప ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకు డీపీఓ ప్రభాకర్ రావు తెలిపారు. సోమవారం 22 చోట్ల అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. పెద్దపప్పూరు మండలం దేవుని ఉప్పలపాడు, పుట్లూరు మండలం జంగంపల్లి సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరగనుండగా... దేవుని ఉప్పలపాడు సర్పంచ్ స్థానం ఏకగ్రీవమైందన్నారు. దీంతో మిగిలిన 11 వార్డు స్థానాలకు, జంగంపల్లి సర్పంచ్ స్థానానికి ఉప ఎన్నికలు జరుగుతున్నాయన్నారు.

రైలు పట్టాలపై ఘోరం

- పట్టాలు దాటుతున్న వృద్ధ దంపతులను ఢీ కొన్న రైలు
- శరీరాలు ఛిద్రమై ఘటనా స్థలంలోనే మృత్యువాత


రాములమ్మ, నరసింహులు(ఫైల్)

ధర్మవరం అర్బన్: పీర్ల పండుగ కోసం కుమార్తె ఇంటికి వచ్చిన వృద్ధ దంపతులు రెండు రోజులు సంతోషంగా గడిపారు. తిరిగి స్వగ్రామం వెళ్లే క్రమంలో రైలు పట్టాలు దాటుతున్న వారిని రైలు ఢీ కొనడంతో దుర్మరణం చెందారు. ఈ సంఘటన సోమవారం తెల్లవారుజామున ధర్మవరం పట్టణంలో జరిగింది. హిందూపురం రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... కనగానపల్లి మండలం కోనాపురానికి చెందిన యరగుంట నరసింహులు(60), రాములమ్మ(55) దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు. అందరికీ వివాహాలయ్యాయి. ప్రస్తుతం హిందూపురంలో నివాసముంటున్న నరసింహులు దంపతులు మొహర్రం పండుగ కోసమని గత శుక్రవారం ధర్మవరంలోని కేతిరెడ్డికాలనీలో ఉంటున్న పెద్ద కుమార్తె ఇంటికి వచ్చారు. సోమవారం తెల్లవారుజామున హిందూపురానికి తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో బస్సు నిలిపేందుకు కూతురు సుభాషిణి కాస్త ముందుగా వెళ్లగా, నరసింహులు, రాములమ్మ కాస్త నిదానంగా బయలుదేరారు. మార్గమధ్యంలో రైలు పట్టాలను రాములమ్మ దాటేసింది. వెనకే వస్తున్న నరసింహులు పట్టాలు దాటే సమయంలో రైలు వస్తున్నట్లు గమనించిన ఆమె వెంటనే వెనక్కు తిరిగి భర్త చేయి పట్టుకుని ముందుకు లాగేందుకు ప్రయత్నించింది. అదే సమయంలో వేగంగా వచ్చిన రైలు వారిద్దరినీ ఢీకొంది. ఘటనలో ఇద్దరి శరీరాలూ ఛిద్రమై అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. హిందూపురం రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

భక్తజన జాతర..


షంషీర్ ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

గుంతకల్లు: పట్టణంలోని పాత గుంతకల్లు ప్రాంతం మస్తానయ్య నామ స్మరణతో మార్మోగింది. హజరత్ మస్తాన్‌వలి ఉరుసు ఉత్సవాల్లో భాగంగా అత్యంత కీలకమైన షంషీర్ ఊరేగింపు సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. తెల్లవారుజామున వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించిన షంషీర్‌ను గుర్రంపై కొలువుదీర్చి, మేళతాళాలతో ఊరేగింపుగా దర్గా నుంచి గణచారిరెడ్డి కులస్తుల ఇంటికి చేర్చారు. సాజెదినాసేన్ (పూజారులు) ప్రత్యేక ప్రార్థనల అనంతరం తిరిగి దర్గాకు తీసుకువచ్చారు. వేలాది భక్తులు తరలిరావడంతో పాత గుంతకల్లు జనసంద్రమైంది. ఊరేగింపులో ఎండు కొబ్బరి కాల్చేందుకు భక్తులు ఎగబడ్డారు. అనంతరం చక్కెర చదివింపులు, తులాభారాలు, జంతుబలులతో మొక్కులు తీర్చుకున్నారు. మంగళవారం జరిగే జియారత్ కార్యక్రమంతో మస్తానయ్య ఉరుసు ఉత్సవాలు ముగిస్తాయని దర్గా కమిటీ సభ్యులు తెలిపారు.

క్లుప్తంగా

హైకోర్టు జడ్జిని కలిసిన ఎస్పీ

అనంతపురం టవర్‌క్లాక్: జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి కె.మన్మథరావును జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా విషయాలు జడ్జితో చర్చించారు. అనంతరం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జిల్లాకు చేరుకోగా పోలీసులు స్వాగతం పలికారు. అనంతరం జిల్లా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షకు మంత్రి హాజరయ్యారు.

ప్రతి పౌరుడూ దేశాభివృద్ధికి పాటుపడాలి



ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న వీసీ జింకా రంగజనార్దన

అనంతపురం: ప్రతి పౌరుడూ దేశాభివృద్ధికి పాటుపడాలని జేఎన్‌టీయూ అనంతపురం వీసీ జింకా రంగజనార్దన అన్నారు. సోమవారం జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలో అజాదీ కా అమృత్ మహోత్సవ్, నా భూమి-నాదేశం కార్యక్రమంలో భాగంగా పాంచ్ ప్రజ్ఞ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమానికి కోఆర్డినేటర్‌గా డాక్టర్ జి.మమత వ్యవహరించారు. వీసీ మాట్లాడుతూ దేశంలోని ప్రతి పౌరుడూ ఐదు పరిష్కారాలపైన దృష్టి సారించాలన్నారు. రాబోయే 25 ఏళ్లల్లో మన దేశాన్ని మరింత అభివృద్ధి చెందేలా దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ ఎం. విజయకుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి. శశిధర్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అరుణ కాంతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ ఎం. అంకారావు పాల్గొన్నారు.

చెత్త తొలగింపునకు చర్యలు తీసుకోండి

అనంతపురం సిటీ: గుత్తి రోడ్డులో ఉన్న డంపింగ్ యార్డులోని చెత్తను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని నగర మేయర్ వసీం కోరారు. జిల్లా పరిషత్ ఆవరణలోని డీపీఆర్‌సీలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మేయర్ వసీం సోమవారం కలిశారు. చెత్తను కాల్చడం వల్ల పరిసర ప్రాంత ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి స్పందిస్తూ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గౌతమిని ఆదేశించారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో శామ్యూల్ స్టీఫెన్ ప్రతిభ



శామ్యూల్ స్టీఫెన్‌ను అభినందిస్తున్న కోచ్

అనంతపురం: ఆంధ్రప్రదేశ్ అండర్-11 బాలుర చెస్ పోటీల్లో శామ్యూల్ స్టీఫెన్ నోబుల్ చాంపియన్‌షిప్ గెలుపొందారు. శ్రీకాకుళంలో ఈ నెల 17 నుంచి 19 వరకు రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు నిర్వహించారు. ఇందులో స్టీఫెన్ ప్రతిభ చాటి చాంపియన్‌షిప్ దక్కించుకున్నారు.

మ్యూజియంలో 'నా దేశం-నా మట్టి' వేడుక



విద్యార్థులతో కలిసి దేశభక్తి గీతాలు ఆలపిస్తున్న మ్యూజియం సిబ్బంది

అనంతపురం కల్చరల్: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నా మట్టి- నా దేశం కార్యక్రమం జిల్లా పురావస్తు శాఖ కార్యాలయంలో సోమవారం ఘనంగా జరిగింది. పురావస్తు శాఖ సహాయ సంచాలకులు రజిత నేతృత్వంలో ఉదయం పలుచోట్ల మొక్కలు నాటారు. అనంతరం నగర వీధుల్లో విద్యార్థులతో కలసి జాతీయ జెండాలు పట్టుకొని ర్యాలీ చేశారు. పీస్ మెమోరియల్ హాలులో విద్యార్థులకు జాతీయ భావం, దేశభక్తి రగిలించే నృత్య పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు.

బాధితులకు తోపుదుర్తి చందు పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు

కనగానపల్లి: ప్రమాదవశాత్తూ రైలు కింద పడి మృతి చెందిన కోనాపురం రాములమ్మ (60), నరసింహులు (65) కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. స్థానిక ఉప సర్పంచ్ రామాంజనమ్మ అత్తామామలైన రాములమ్మ, నరసింహులు ధర్మవరం సమీపంలో రైలు కింద పడి సోమవారం మృతి చెందారు. తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పంద్రాగస్టు సందడి

నగరంలో 77వ స్వాతంత్ర్య వేడుకలు మంగళవారం నిర్వహించనున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, యూనివర్సిటీల్లో జెండా పండుగ ఘనంగా జరపనున్నారు. అందుకు ఏర్పాట్లు కూడా పూర్తయ్యాయి. నగరంలో పెద్ద భవనాలపైనే కాకుండా ఇళ్లపైనా జెండాలు కట్టారు. జాతీయ జెండాలు, బ్యాడ్జిల విక్రయాలు జోరుగా సాగాయి. ఎక్కడ చూసినా జాతీయ జెండా రంగులతో డ్రస్సులు కూడా తయారు చేసి, దుకాణాల్లో విక్రయానికి ఉంచారు. చిన్నా పెద్దా తేడాలేకుండా ప్రతి ఒక్కరూ జాతీయ జెండాలు కొనుగోలు చేయడంతో దుకాణాలు కిక్కిరిశాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



విద్యుత్ దీపాల వెలుగుల్లో జిల్లా పరిషత్ కార్యాలయం



విద్యుత్ దీపాల వెలుగుల్లో నగరపాలక సంస్థ కార్యాలయం



కలెక్టర్ కార్యాలయం గోడలకు వేసిన బొమ్మలు



జెండాలు కొనుగోలు చేస్తున్న దృశ్యం





దుకాణంలో జాతీయ జెండా రంగులు ఉన్న డ్రస్సులు కొనుగోలు చేస్తున్న దృశ్యం

77 అడుగుల జాతీయ పతాకంతో ర్యాలీ

అనంతపురం అర్బన్: 77వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సేవ్ ఇండియా- సేవ్ డెమోక్రసీ నినాదంతో విద్యార్థినులు 77 అడుగుల జాతీయ పతాకంతో స్థానిక రైల్వే స్టేషన్ నుంచి టవర్‌క్లాక్ వరకు సోమవారం ర్యాలీ చేశారు. ఐద్వా, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేశ్ మాట్లాడారు. బ్రిటీష్ పాలనను తలపించేలా దేశంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ పాలన సాగుతోందన్నారు. ఈ తొమ్మిదేళ్ల బీజేపీ పాలనలో అత్యాచారాలు, మత విద్వేషాలు, దాడులు పెరిగాయన్నారు. ఇందుకు మణిపూర్ ఘటన నిదర్శనమన్నారు. ఇలాంటి పరిస్థితుల నుంచి దేశాన్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిపౌరుడిపై ఉందన్నారు. కార్యక్రమంలో నాయకురాళ్లు రజిత, రామాంజినమ్మ, గిరి, సూర్యప్రకాశ్, శివ, తదితరులు పాల్గొన్నారు.



77 అడుగుల జాతీయ పతాకంతో ర్యాలీ చేస్తున్న విద్యార్థినులు

ఆర్ట్స్ కళాశాలలో 'హర్ ఘర్ తిరంగా'

రాప్తాడురూరల్: అనంతపురం ఆర్ట్స్ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో 'మేరీ మాటీ మేరా దేశ్' అనే ప్రచార ఉద్యమంలో భాగంగా 'హర్ ఘర్ తిరంగా' అనే కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆశావాది శశాంకమౌళి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆజాదీ కా అమృత్ మహోత్సవాలను దేశభక్తి, జాతీయతా భావంతో ఘనంగా జరుపుకోవాలన్నారు. మువ్వన్నెల జెండాతో సెల్ఫీ దిగి హర్ ఘర్ తిరంగా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి విష్ణుప్రియ, వృక్ష శాస్త్ర ఉపన్యాసకులు రఘురాములు, అమృతలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి



ఎస్వీఐటీలో విద్యార్థుల ర్యాలీ

రాప్తాడు: స్థానిక తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో స్వాతంత్ర్య వేడుకలకు అన్ని ఏర్పాటు పూర్తి చేశామని తహసీల్దార్ లక్ష్మీనరసింహ, ఎంపీడీఓ సాల్మన్, ఎంఈఓ మల్లికార్జున తెలిపారు. అనంతరం తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలను ముస్తాబు చేశారు.

రాప్తాడు: అమరవీరుల త్యాగ ఫలితంతోనే స్వాతంత్ర్యం సిద్ధించిందని ఎస్వీఐటీ కళాశాల కరస్పాండెంట్ వీటీఆర్‌శర్మ, చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ వెన్నపూస రవీంద్రారెడ్డి తెలిపారు. సోమవారం ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా హంపాపురం సమీపంలో ఎస్వీఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నా మట్టి – నా దేశం అమరవీరులకు వందనం కార్యక్రమంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. కళాశాల సీఈఓ ఆనంద్ కుమార్, ప్రిన్సిపాల్ సూర్యశేఖర్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శ్రీనివాసులు నాయక్ పాల్గొన్నారు.

ఆత్మకూరు: మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలతో పాటు, ప్రభుత్వ పాఠశాలల్లో స్వాతంత్ర్య వేడుకలకు ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. కేజీబీవీ విద్యార్థినులు నృత్య ప్రదర్శన చేయనున్నట్లు ప్రిన్సిపాల్ లీమారోజ్ తెలిపారు. పలు పాఠశాలల్లో విద్యార్థులకు ఆటల పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మంగళవారం బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

మున్సిపల్ ఇంజినీర్ ఈశ్వరయ్య మృతి

గుంతకల్లుటౌన్: గుంతకల్లు మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పని చేస్తున్న ఎస్.ఈశ్వరయ్య (61) సోమవారం రాత్రి మరణించారు. 20 రోజుల క్రితం అనారోగ్యంతో మెడికల్ లీవ్‌లో వెళ్లిన ఆయన చికిత్స నిమిత్తం అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. గతంలో అహుడాలో ఈఈగా పని చేస్తూ బదిలీపై గుంతకల్లుకు వచ్చిన ఈశ్వరయ్య ఈ యేడాది జూన్ 5న బాధ్యతలు చేపట్టారు.

గడువులోపు నిర్మాణాలన్నీ పూర్తి కావాలి

అనంతపురం సిటీ: ప్రభుత్వ శాఖలకు సంబంధించిన కార్యాలయాల భవన నిర్మాణాలతో పాటు రహదారుల నిర్మాణాలు నిర్దేశిత గడువులోపు పూర్తి కావాలని పంచాయతీ రాజ్ ఇంజినీర్లను ఆ శాఖ ఎస్ఈ యమ్మాని భాగ్యరాజ్ ఆదేశించారు. అభివృద్ధి పనులపై ఈఈ, డీఈలతో పీఆర్ డివిజనల్ కార్యాలయంలో సోమవారం ఆయన సమీక్షించారు. నిర్మాణాలన్నీ నాణ్యతగా ఉండాలని, నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. పూర్తయిన భవనాలు, రహదారుల వివరాలు క్వాలిటీ కంట్రోల్ విభాగానికి పంపాలన్నారు. క్వాలిటీ కంట్రోల్(క్యూసీ) రిపోర్ట్ మేరకే బిల్లులు చెల్లించాలని స్పష్టం చేశారు. కొన్ని సబ్ డివిజన్ల పరిధిలో నిర్మాణాలు పూర్తయిన వాటి వివరాలు క్వాలిటీ కంట్రోల్ విభాగానికి పంపడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారని, ఈ విషయంలో నిర్లక్ష్యం పనికి రాదన్నారు. ఈ విషయంగా డీఈలు, ఏఈలు చొరవ చూపాలన్నారు. ఇప్పటి వరకు పనులు పూర్తయిన వాటికి వంద శాతం బిల్లులను ప్రభుత్వం చెల్లించినట్లు గుర్తు చేశారు. జరగబోయే పనులకు మాత్రమే బిల్లులు చెల్లించాల్సి ఉంటుందని, ఈ విషయాన్ని కాంట్రాక్టర్లకు వివరించి, వెంటనే పనులు పూర్తి చేయించాలన్నారు. ఈఈ శంకరయ్య, డీఈలు రాచంరెడ్డి భాస్కర్‌రెడ్డి, గురుమూర్తి రావు, అరుణ్‌కుమార్, శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీఆర్ ఎస్ఈ భాగ్యరాజ్

దండిగా ఎరువులు

- తాజాగా 2,119 మెట్రిక్ టన్నుల సరఫరా



ఎరువులను పరిశీలిస్తున్న అధికారులు

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్ ఎరువుల ప్రణాళికలో భాగంగా నెలవారీ కోటా మేరకు వివిధ కంపెనీల నుంచి క్రమం తప్పకుండా ఎరువులు సరఫరా అవుతున్నాయి. దాదాపు అన్ని కంపెనీల ఎరువులు జిల్లా వ్యాప్తంగా తగినంత నిల్వలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. తాజాగా సోమవారం ఇండియన్ పొటాష్ కంపెనీ (ఐపీఎల్)కి చెందిన 2,119 మెట్రిక్ టన్నులు సరఫరా అయినట్లు రేక్ ఆఫీసర్, ఏడీఏ ఎం.రవి తెలిపారు. రాప్తాడు ఏఓ పి.వెంకటేశ్వరప్రసాద్‌తో కలిసి ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్‌లో వ్యాగన్ల ద్వారా వచ్చిన ఎరువుల రేక్ పాయింట్‌ను పరిశీలించారు. 1,090 మెట్రిక్ టన్నులు యూరియా, 590 మెట్రిక్ టన్నుల డీఏపీ, 16-16-16 రకం కాంప్లెక్స్ 440 మెట్రిక్ టన్నులు వచ్చిందన్నారు. కలెక్టర్, జేసీ, డీఏఓ ఆదేశాల మేరకు ఆర్బీకేలు, సొసైటీలకు ప్రాధాన్యత ఇస్తూ... హోల్‌సేల్, ప్రైవేట్ డీలర్లకు ఇండెంట్ ప్రకారం సరఫరా చేస్తామన్నారు. మిగతావి మార్క్‌ఫెడ్, కంపెనీ గోదాముల్లో నిల్వ చేయనున్నట్లు తెలిపారు.

వార్డు మెంబర్ స్థానం ఏకగ్రీవం

రాప్తాడు: మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీలోని రెండో వార్డు మెంబర్ సాకే ఆదిలక్ష్మి ఏకగ్రీవంగా ఎంపికైనట్లు రిటర్నింగ్ అధికారి దామోదర్‌రెడ్డి సోమవారం ప్రకటించారు. ప్రసన్నాయపల్లి రెండో వార్డు మెంబర్ సాకే కృష్ణమూర్తి అనారోగ్యంతో రెండేళ్ల క్రితం మృతి చెందారు. ఉప ఎన్నికకు ఈనెల 6న ఎలక్షన్ కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 10 వైఎస్సార్‌సీపీ మద్దతురాలు సాకే ఆదిలక్ష్మి రెండు సెట్లు, మరో వైఎస్సార్ సీపీ మద్దతుదారుడు వేల్పుల శ్రావణ్‌కుమార్ ఒక సెట్ దాఖలు చేశారు. టీడీపీ మద్దతుదారుడు వెంకటేశులు ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు.టీడీపీ మద్దతుదారుడిపై పోలీస్ కేసులున్న విషయాన్ని ఆధారాలతో బయటపడడంతో ఈఆర్‌ఓ దామోదర్‌రెడ్డి అతని నామినేషన్‌ను తిరస్కరించారు. బరిలో ఉన్న ఇద్దరు వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల్లో వేల్పుల శ్రావణ్‌కుమార్ ఉదయం 11 గంటలకు నామినేషన్‌ను ఉపసంహరించుకున్నాడు. దీంతో సాకే ఆదిలక్ష్మి ఏకగ్రీవంగా ఎంపికైంది. ఎన్నికల రిటర్నింగ్ అధికారి సాకే ఆదిలక్ష్మికి డిక్లరేషన్ ఫాం అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాల్మన్, ఏఓ రత్నబాయి, వైఎస్సార్ సీపీ నాయకులు వెన్నపూస లోకేశ్వర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు వెల్పుల రాజశేఖర్, వేల్పుల శ్రావణ్ కుమార్, వెంకట్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి, సాంబశివారెడ్డి, వర్థిరెడ్డి రమణారెడ్డి పాల్గొన్నారు.



డిక్లరేషన్ ఫాం అందుకుంటున్న వార్డు మెంబర్ సాకే ఆదిలక్ష్మి

హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులు పూర్తి చేయండి

అనంతపురం సెంట్రల్: హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులు పూర్తి చేసి ఆయకట్టును కాపాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో హెచ్చెల్సీ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాకు ఏకైక ఆదరవు తుంగభద్ర జలాశయమని, దశాబ్దాల క్రితం నిర్మించిన కాలవ కావడంతో గట్లు బలహీనంగా మారాయన్నారు. దీంతో జిల్లాకు రావాల్సిన నీటిని పూర్తిగా వినియోగించుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. తరుచూ గండ్లు పడుతున్నాయని, బ్రిడ్జిలు కూలిపోతున్నాయన్నారు. కాలువ ఆధునికీకరణపై దృష్టి సారించాలని, చివరి ఆయకట్టుకు కూడా సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు నల్లప్ప, బాలరంగయ్య, నాయకులు రామిరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, భాస్కర్, రామాంజి, వెంకటనారాయణ, ప్రకాష్‌రెడ్డి, వలి, మసూద్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఈక్రాప్ చేయించాలి

ఆత్మకూరు: మండలంలో ఖరీఫ్ సీజన్‌లో పంట సాగు చేసిన ప్రతి రైతూ ఈ క్రాప్ బుకింగ్ చేసుకోవాలని ఏఓ సుచరిత తెలిపారు. సోమవారం మండలంలోని ఆత్మకూరు వద్ద వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో ఖరీఫ్‌లో సాగు చేసిన పంటను ఈ క్రాప్ చేశారు. ఏఓ మాట్లాడుతూ పంట సాగు చేసిన రైతులు ఈ క్రాప్ చేయించలేదన్నారు. రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ సిబ్బందని, గ్రామ వలంటీర్ల ద్వారా ఈ క్రాప్ చేయించుకోవాలని రైతులకు సూచించారు. ఏఈఓ సుజిత, వీఎస్ఓ భాగ్యలక్ష్మి, వీఏఏ నరసింహ, రైతులు పాల్గొన్నారు.

న్యాయవాదుల రాష్ట్రకమిటీలో అనంత వాసికి చోటు

అనంతపురం: ఆలిండియా లాయర్స్ యూనియన్ 12వ రాష్ట్ర మహా సభలు గుంటూరులో జరిగాయి. ఇందులో రాష్ట్ర కమిటీని ఎంపిక చేశారు. రాష్ట్ర కమిటీ సభ్యులుగా అనంతపురానికి చెందిన సూర్యచంద్ర యాదవ్‌ను ఎంపిక చేసినట్లు రాష్ట్ర అధ్యక్షుడు సుంకర రాజేంద్రప్రసాద్ ప్రధాన కార్యదర్శి మాధవరావు తెలిపారు.

హెచ్ఓ ధనుంజయకు ఏడీగా పదోన్నతి

అనంతపురం అగ్రికల్చర్: ఉద్యానశాఖ అనంతపురం రూరల్ హార్టికల్చర్ ఆఫీసర్‌గా పని చేస్తున్న ధనుంజయకు అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్‌గా పదోన్నతి కల్పిస్తూ సోమవారం ఆ శాఖ కమిషనరేట్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ధనుంజయను శ్రీశైలంలో ఉన్న ఐటీడీఏకు ప్రాజెక్ట్ ఉద్యాన అధికారిగా నియమిస్తూ బదిలీ చేశారు.

ఆర్ట్స్‌కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్

రాప్తాడురూరల్: అనంతపురం ఆర్ట్స్ కళాశాల రసాయనశాస్త్ర అధ్యాపకుడు దాచేపల్లి రాజుకు శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈయన ఎస్కేయూ రసాయనశాస్త్ర విభాగ ప్రొఫెసర్ జె.శ్రీరాములు పర్యవేక్షణలో 'క్షయవ్యాధికి వాడే ఔషధాల్లో నూతన ఆవిష్కరణలు' అనే అంశంపై చేసిన పరిశోధనలకు డాక్టరేట్ అవార్డు అందుకున్నారు.

బాస్కెట్‌బాల్ పోటీల్లో సత్తా

రాప్తాడురూరల్: కోర్టురోడ్డులోని చైతన్య పాఠశాల 8వ తరగతి విద్యార్థి సయ్యద్ అహమ్మద్ తౌఫిక్‌ను ఏజీఎం సుబ్బారెడ్డి సోమవారం అభినందించారు. సయ్యద్ అహమ్మద్ తౌఫిక్ ఇటీవల జరిగిన బాస్కెట్ బాల్ జిల్లా స్థాయి పోటీల్లో మూడోస్థానం సాధించాడు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తబస్సుమ్, వైస్ ప్రిన్సిపాల్ బాలకృష్ణ, కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, డీన్లు అప్పలనాయుడు, సిరాజుద్దీన్, మహేష్, ఏఓ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

20న సాహిత్య పురస్కార సభ

అనంతపురం కల్చరల్: కవి సమ్మేళనం సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ఈనెల 20న కొత్తపల్లి సరేంద్రబాబు సాహిత్య పురస్కార ప్రదానోత్సవ సభ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కొత్తపల్లి సురేష్ ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక కేంద్ర గ్రంథాలయంలో ఉదయం 10 గంటలకు జరగనున్న సాహితీ సభ ఉంటుందన్నారు.

'స్పందన'లో 9 వినతులు

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి 9 ఫిర్యాదులు వచ్చాయి. అందులో ప్రజారోగ్య విభాగానికి సంబంధించి 2, టౌన్ ప్లానింగ్ 7 ఫిర్యాదులు అందాయి. స్పందన కార్యక్రమంలో నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు, ఈఈ చంద్రశేఖర్, డీఈ శేఖర్, సూపరింటెండెంట్లు దేవశంకర్, విజయ్‌కుమార్, వేణుగోపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కార్గో వస్తువుల వేలం

అనంతపురం సెంట్రల్: ఏపీఎస్ఆర్టీసీ కార్గోలో వినియోగదారులు తీసుకెళ్లని వస్తువులకు సోమవారం వేలం నిర్వహించారు. మొత్తం 80 వస్తువులను వేలం వేయగా రూ. 67 వేలు ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో ఆర్టీసీ ఏటీఎం (కమర్షియల్) నాగభూపాల్, ఏఓ లక్ష్మీదేవి, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

అనంతపురం రూరల్: గ్రామీణ నీటి సరఫరా సంస్థ విభాగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కోరారు. సోమవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షకు హాజరైన మంత్రి పెద్దిరెడ్డిని సీఐటీయూ నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ మాట్లాడుతూ గ్రామీణనీటి సరఫరా, సత్యసాయి, శ్రీరామరెడ్డి తాగునీటి పథకంలో పని చేస్తున్న కార్మికులకు వేతనబకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్, గ్రాడ్యుటీ చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ సూపరింటెండెంట్‌పై ఫిర్యాదు

అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రి గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్ మంజుపై గుంటూరు జిల్లా సంగడిగుంటకు చెందిన ఎస్.శ్రీనివాస్‌రెడ్డి అనే వ్యక్తి కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన స్పందనలో జేసీ కేతన్‌గార్గ్‌కు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదులో పొందుపర్చిన అంశాలు ఇవీ.. గ్రేడ్- 1 నర్సింగ్ సూపరింటెండెంట్ మంజు ఎస్టీ కేటగిరి కింద స్టాఫ్‌నర్సు, హెడ్‌నర్సు, గ్రేడ్- 2 నర్సింగ్ సూపరింటెండెంట్, గ్రేడ్- 1 నర్సింగ్ సూపరింటెండెంట్ హోదాల్లో పని చేశారు. వాస్తవంగా ఆమె ఫార్వర్డ్ కులానికి చెందిన వారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలు వెల్లడించాలని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీనిపై వివరణ ఇవ్వాలని సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావును జేసీ కేతన్‌గార్గ్ ఆదేశించారు.

సాక్షి
ఫ్యామిలీ
అనంతపురం
మంగళవారం ॥ 15-8-2023

ఆగస్టు 15

ఆమె... దేశంలో సగం ఎప్పుడు!?

స్వాతంత్ర్య దినోత్సవం దేశ ఔన్నత్యాన్ని మాట్లాడుతుంది. దేశ ఉజ్వల భవిష్యత్తును కాంక్షిస్తుంది. కాని దేశంలో సగమైన స్త్రీలు సంపూర్ణ స్వాతంత్ర్య ఫలాలు ఇంకా పొందవలసే వుంది. ఏనాడైతే స్త్రీల పట్ల సురక్షితమైన, సంస్కారవంతమైన ప్రవర్తనను ఈ సమాజం చూపుతుందో అప్పుడే స్త్రీలకు సంపూర్ణ స్వాతంత్ర్యం వచ్చినట్టు. అప్పుడే దేశ ఔన్నత్యం ఇనుమడించినట్టు. 'ఆకాశంలో సగం'లాగా దేశంలో సగం ఇంకెప్పుడు?



నేడు ఆగస్టు 15న ఎర్రకోట మీద జెండా ఎగుర వేసే సమయంలో ప్రధాని నరేంద్ర మోడీకి ఇద్దరు మహిళా ఆర్మీ ఆఫీసర్లు సహకారం అందిస్తారు. మేజర్ నికితా నాయర్, మేజర్ జాస్మిన్ కౌర్ పతాకావిష్కరణ సమయంలో ప్రధానితో పాటుగా ఉండి జెండా వందనం సమర్పిస్తారు. ఈ విశేష ఘట్టంలో ఇద్దరు మహిళలకు ఈ విధంగా చోటు దక్కడం సంతోషపడాల్సిన సంగతి. 76 ఏళ్ల క్రితం స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకు స్త్రీల స్థితిగతుల్లో వచ్చిన పురోభివృద్ధికి ఇదీ ఒక సంకేతమే. నాటి నుంచి నేటి వరకు విద్య, ఉపాధి, ఉద్యోగం, సైన్యం, పాలనా యంత్రాంగం, శాసన వ్యవస్థ... వీటిల్లో స్త్రీలకు గణనీయంగా స్థానం దక్కింది. ప్రాముఖ్యం లభించింది. అయితే అంతమాత్రాన స్త్రీలు సంపూర్ణంగా స్వాతంత్ర్య ఫలాలు అనుభవిస్తున్నారా అనేది ప్రశ్న.

స్త్రీల త్యాగం

దాస్య భారతంలో జరిగిన స్వాతంత్ర్య పోరాటంలో ఎందరో స్త్రీలు పాల్గొన్నారు. అన్నింటికి మించి పురుషులు దేశం కోసం ప్రాణాలు అర్పించినా, జైళ్ల పాలైనా స్త్రీలు ధైర్యంగా ఇళ్లు నడిపి కష్టాలను ఈదారు. దేశ విభజన సమయంలో తీవ్ర హింసను ఎదుర్కొన్నారు. అంతెందుకు 1930 నాటికి దేశ వ్యాప్తంగా 30 వేల మంది స్త్రీలు స్వాతంత్ర్య పోరాటంలో ఏదో విధాన జైలు శిక్ష అనుభవిస్తున్నారని తెలిస్తే ఆశ్చర్యం వేస్తుంది. ఈ స్త్రీల పోరాటం చాలామటుకు చరిత్రలో నమోదు కాకుండానే కాలగర్భంలో కలిసిపోయింది. ఇప్పుడిప్పుడే నాటి వీర వనితల గాథలు వెలికి వస్తున్నాయి. ఇంత పోరాటం, త్యాగం చేసి స్త్రీల భాగస్వామ్యంతో తెచ్చుకున్న స్వాతంత్ర్యంలో స్త్రీలు నిజంగా సంతోషంగా ఉన్నారా?

సురక్షితం కాని దేశం

'ఒక స్త్రీ అర్ధరాత్రి క్షేమంగా నడిచి వెళ్లినప్పుడే ఈ దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్టు' అని గాంధీజీ ఏ ముహూర్తంలో అన్నారో కాని అలాంటి స్థితి నేటికీ రాకపోగా నానాటికీ తీసికట్టుగా తయారవుతోంది. ఎన్ని చట్టాలు చేసినా, శిక్షలు తెచ్చినా స్త్రీలను గౌరవించాలి, వారి ఆత్మగౌరవాన్ని కాపాడాలి అని మెజారిటీ సమాజం అనుకోవడం లేదు. 'నస్త్రీ స్వాతంత్ర్య మర్హతి' అనే భావన సమాజంలో ఆది కాలం నుంచి చొప్పించి ఉండటం వల్ల స్త్రీ చేసే ప్రతి పనిలో తప్పు ఎంచడం, అదుపు చేయడం, చులకనగా చూడటం, వివక్ష చూపడం, దండించడం ఆనవాయితీగా మారింది. పిల్లల పెంపకం దశ నుంచే స్త్రీలను గౌరవించడం నేర్పించడం లేదు. ఇంట్లో అమ్మాయిని ఒకలాగా, అబ్బాయిని ఒకలాగా పెంచడం వల్ల ఈ అబ్బాయిలు 'సమాజం'గా మారి స్త్రీ పాలిట బెడదగా మారుతున్నారు. తమ మాటకు ఎటువంటి తిరస్కారం చెప్పినా పురుషుడు శిక్షించేవాడై స్త్రీని చంపేందుకు వెనుకాడటం లేదు. స్త్రీకి ఒక అభిప్రాయం కలిగి ఉండే స్వాతంత్ర్యం ఆమెకు ఎందుకు ఇవ్వడం లేదు?

స్త్రీలను ప్రేమ, మర్యాద, గౌరవాలతో కుటుంబం చూసుకోవాలి. అప్పుడు ఆ మర్యాద, గౌరవాలు సమాజంలోకి ఆటోమేటిక్‌గా వస్తాయి. కుటుంబం స్త్రీకి ఎలా రక్షణ ఇస్తుందో సమాజం కూడా స్త్రీకి అలా రక్షణ ఇవ్వాలనే పౌర శిక్షణ, సంస్కారం అవసరం. పురుషులు మాత్రమే కాదు స్త్రీలు కూడా కుటుంబం, సమాజం, దేశం కోసం గొప్పగా ఆలోచించగలరు. వారికి స్వేచ్ఛ, స్వాతంత్ర్యం ఇచ్చి చూస్తే తెలుస్తుంది. అటువంటి వేకువలోకి దేశం ఉదయించాలని ఈ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కోరుకుందాం.



● ఫ్రీడమ్ ఫిల్లింగ్ స్టేషన్, శిక్ష(ణ)లో ఉన్న మహిళలే నిర్వాహకులు

77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా...
ఆల్ ఉమెన్ పెట్రోల్ బంక్

కారాగారంలో గడిపే సమయం శిక్ష సమయం కాదు, శిక్షణ సమయం. కారాగారం మానసిక పరివర్తన దిశగా శిక్షణ ఇచ్చే ప్రదేశం. శిక్ష పూర్తయి విడుదలైన తర్వాత సమాజంలో గౌరవంగా జీవించడానికి అవసరమైన నైపుణ్య శిక్షణ కూడా ఇచ్చే ప్రదేశంగా ఉండాలి. అలాగే ఉంటాయి కూడా. అయితే ఈ ఏడాది దేశం మరో అడుగు ముందుకేసింది. శిక్ష అనుభవిస్తున్న మహిళలకు ఉపాధి అవకాశాలను జైలు గోడల మధ్య కాకుండా సమాజంలో కల్పించడం ఈ స్వాతంత్ర్య దినోత్సవం ప్రత్యేకత.

చెన్నై నగర శివారులో అంబత్తూరు– పుఝల్ రోడ్డులో ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు 'ఆల్ ఉమెన్ పెట్రోల్ బంక్' అనే ప్రయోగాత్మకమైన సంస్కరణకు వేదికైంది. పుఝల్ మహిళల కారాగారంలో శిక్ష అనుభవిస్తున్న మహిళల్లో ముప్పై మందికి ఉద్యోగం ఇచ్చింది. దేశంలో ఇదే మొదటి ప్రయత్నం. ఈ ప్రయత్నంతో ఈ పెట్రోల్ బంకు ఫ్రీడమ్ ఫిల్లింగ్ స్టేషన్ అనే గౌరవ సూచికకు అర్హత సాధించింది. ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పన్నెండు గంటలు మహిళలు విధులు నిర్వర్తిస్తారు. ఆ తర్వాత పురుష ఖైదీలు విధుల్లోకి వస్తారు.

ఖైదీలు తమ శిక్ష కాలం పూర్తయిన తర్వాత సమాజంలో గౌరవంగా జీవించడం కోసం రకరకాల వృత్తుల్లో శిక్షణ ఇస్తారు. అవన్నీ జైలు గోడల మధ్యనే ఉంటాయి. మారుతున్న సమాజానికి తగినట్లు కొత్త కొత్త ఉపాధి మార్గాలకు తగిన ఏర్పాట్లు ఉండవు. అందుబాటులో ఉన్న పనుల్లోనే శిక్షణ ఇవ్వడమే జరిగేది. ఇదిలా ఉంటే... జైళ్లలో మహిళా ఖైదీలకు తగిన సౌకర్యాల పర్యవేక్షణ కోసం అన్ని రాష్ట్రాల్లో పర్యటించిన మహిళా కమిషన్ సభ్యుల పరిశీలనలో కొత్త విషయాలు తెలిశాయి. జైలు గోడల మధ్య ఉండడం వల్ల మహిళలు మానసికంగా కుంగుబాటుకు లోనవుతున్నారని, వారికి సమాజంలో భాగస్వామ్యం కల్పించాలని సూచించడంతో, ఆ సూచనను అందుకున్న జైలు అధికారుల్లో మొదటగా పుఝల్ జైలు అధికారులు ఈ ప్రయత్నం చేశారు. మహిళలకు పెట్రోల్ పట్టడంలో శిక్షణ ఇవ్వడంతోపాటు వినియోగదారులతో మాట్లాడడం, ఉద్యోగానికి తగిన ప్రవర్తనా నియమావళిలో కూడా మహిళలకు శిక్షణ ఇప్పించారు.

పెట్రోల్ బంకులో విధులు నిర్వర్తిస్తున్న మహిళలు తమకు స్వాతంత్ర్యం వచ్చినట్లు సంతోషిస్తున్నారు. శిక్ష కాలాన్ని ఆనందంగా పూర్తి చేస్తామని, పరిపూర్ణమైన వ్యక్తిత్వంతో సమాజంలోకి విడుదలవుతామని చెప్పారు.

> **శిక్ష కాలం సమాజంలోనే!**
> శిక్షణ కాలంలో మారుతున్న కాలానికి అనుగుణంగా సంస్కరణలు తీసుకు రావడంతోపాటు ఖైదీలను సమాజంతో అనుసంధానం చేయడం, వారి పునరావాసం కోసం పని చేయడం కూడా అవసరమే. ఆ అవసరాన్ని గుర్తించి మహిళలతోనే ముందడుగు వేసింది జైళ్ల శాఖ. శిక్ష సమయంలో కూడా సమాజంలో మనుషులతో మాట్లాడుతూ ఉంటే మానసికంగా ఆరోగ్యంగా ఉంటారు. సమాజానికి దూరంగా ఉన్నామనే ఆవేదన దూరమవుతుంది. సమాజంలోనే నివసిస్తున్న భావనతో జీవిస్తారు.

స్వాతంత్ర్యాన్ని ఇలా ఎంజాయ్ చేయండి!

నేటి టెక్నాలజీ యుగంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని హాలిడేగా తీసుకుని ఆనందించే వారే ఎక్కువ. స్కూలు, కాలేజీ విద్యార్థులైతే జెండా వందనం తరువాత ఇంటికెళ్లిపోవచ్చు అని తెగ సంబరపడిపోతుంటారు. కానీ డెబ్బై ఆరేళ్లుగా విరామం లేకుండ జరుపుకొంటూ నేడు 77వ వసంతంలో అడుగు పెట్టాం. దేశాన్ని పాలించే అధికారులు అధికారికంగా ఈ వేడుకలు జరిపిస్తున్నారు. బాధ్యత గల పౌరులుగా మనం ఇలా సెలబ్రేట్ చేసుకుందాం....



● ఉదయాన్నే ఎర్రకోటపై జరిగే జెండావందనం, వివిధ కార్యక్రమాలను టీవీలో చూడాలి. డెబ్బై ఏడేళ్ల స్వాతంత్ర్య భారతం ఎంత ఎత్తుకు ఎదిగిందన్న అంశాలను ప్రత్యక్ష ప్రసారాలు చూడడం ద్వారా తెలుసుకోవచ్చు ● తరువాత ఎప్పటి నుంచో అనుకుంటున్న ప్లేసుకి ఈరోజు వెళ్లండి. ఒక రోజులో వెళ్లిరాగల ప్రాంతానికి వెళ్లి అక్కడ గడిపి మీ ఒత్తిడిని దూరం చేసుకోండి. అక్కడ స్వతంత్ర దినోత్సవాన్ని గుర్తుండిపోయేలా గడపండి. ● రోజూ వేసుకునే దుస్తులు కాకుండా భారతీయ సంప్రదాయం ఉట్టిపడేలాంటి దుస్తులు ధరించండి. వీలైనంత వరకు డ్రెస్‌లో తెలుపు, కాషాయం, ఆకుపచ్చని రంగులు ఉండేలా చూసుకుని వేసుకోవాలి. అప్పుడు త్రివర్ణ పతాకానికి మరింత వన్నె తెచ్చినవారవుతారు ● ఎక్కడికీ వెళ్లే ఓపిక లేనప్పుడు ఇంట్లోనే ఉండి దేశభక్తి సినిమాలు చూడండి. మీతోపాటు మీ పిల్లలకు మన దేశ చరిత్ర, ఔన్నత్యాలు తెలుస్తాయి ● మరింత ఉత్సాహంగా సెలబ్రేట్ చేసుకోవాలంటే మూడు రంగులు ఉండేలా వెరైటీ డిష్‌లు తయారు చేసుకుని తినండి ● స్వాతంత్ర్య దినోత్సవం అర్థం ఉట్టిపడేలా గాలిపటాలు ఎగరవేయండి. మూడు రంగుల్లో ఉన్న గాలిపటాలను వీలైనంత ఎత్తుకుఎగరేస్తూ మనకొచ్చిన స్వేచ్ఛను ఎంజాయ్ చేయవచ్చు ● పుస్తకాల పురుగులు అయితే దేశభక్తి పుస్తకాలను చదవండి. స్వాతంత్ర్య సమర యోధుల విజయగాథలు, వీరిలో బాగా పాపులర్ అయిన నాయకుల బయోగ్రఫీని చదివి ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చు ● దేశభక్తి గీతాలు వింటూ కూడా సంబరాలు జరుపుకోవచ్చు. అలనాటి పోరాట, అసామాన్య త్యాగాలను గుర్తుచేసే పాటలను వినాలి. లతా మంగేష్కర్, మహ్మద్ రఫీ, ఏఆర్ రెహ్మాన్ పాటలు మనలో నిద్రపోతున్న దేశభక్తిని తట్టి లేపుతాయి ● ఇంటి చుట్టుపక్కల వారు లేదా బంధువులు, కుటుంబ సభ్యులతో దగ్గరలో జరుగుతోన్న జెండా పండుగకు వెళ్లి రెపరెపలాడే త్రివర్ణ పతాకానికి జైహింద్ కొట్టాలి ● దేశానికి పెద్ద సేవ చేయలేక పోయినప్పటికీ మీ చుట్టుపక్కల ఉన్న వారందరికి స్వీట్లు పంచి, నోరు తీపి చేస్తూ స్వతంత్ర దినోత్సవ వేడుకలు జరుపుకోండి.

ప్రతి భారతీయుడికి ఎంతో విలువైన బహుమతులు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు. అందుకే వీలైనంత వరకు అందరితో కలిసి జరుపుకోవాల్సిన జెండా పండుగ ఇది. సెలవు దొరికింది అని సంబరపడిపోక వీటిలో ఏ ఒక్కదాన్ని పాటించినా స్వాతంత్ర్య దినోత్సవాన్ని గౌరవించినట్లే.

జీవన సేద్యం!

● పెద్ద కమతాల్లో సేంద్రియ వరి సేద్యంలో జీవన ఎరువులు/పురుగుమందులు కీలకం



● వ్యవసాయ క్షేత్రంలో సిద్ధమవుతున్న జీవన ఎరువులు

సేంద్రియ/ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో ద్రావణాలు, కషాయాలను చిన్న, సన్నకారు రైతులు తయారు చేసుకొని వాడగలుగుతున్నారు. అయితే, ఎక్కువ విస్తీర్ణంలో సేంద్రియ/ప్రకృతి సేద్యం చేసే పెద్ద రైతులకు వీటి తయారీ కష్టం కావటంతో జీవన ఎరువులు, జీవన పురుగుమందులను విరివిగా వినియోగిస్తున్నారు. రైతు శాస్త్రవేత్త, తునికిలోని ఏకలవ్య కేవీకే సలహాదారు, హార్ట్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఎం.ఎస్.సుబ్రహ్మణ్యం రాజు గత కొన్ని సంవత్సరాలుగా చిన్న, పెద్ద కమతాల్లో సాగు చేసే రైతులతో కలసి పనిచేస్తున్నారు. ఖరీఫ్/లేటు ఖరీఫ్ వరి సాగులో చిన్న కమతాల రైతులు, పెద్ద కమతాల రైతులు ఏయే ఉత్పాదకాలను, ఎంతెంత మోతాదులో వాడితే మంచి ఫలితాలు వస్తున్నాయన్న అంశాలను ఆయన 'సాక్షి సాగుబడి'కి ఇలా వివరించారు.

వరి నారుమడిని నీరు నిలవని విధంగా తయారు చేసుకోవాలి. విత్తనాన్ని ఒక రోజు ముందు ఎండబెట్టి మరునాడు విత్తన శుద్ధి చేయాలి. నిద్రావస్థ ఉన్న విత్తనాలను, నిద్రావస్థ తొలగించడానికి గోరువెచ్చని నీటిలో నానబెట్టి, అనంతరం విత్తనాలను నారుమడిపై వెదజల్లాలి. 2వ రోజు నీరు బయటకు తీయాలి. 5వ రోజు నీరు పెట్టాలి. తర్వాత తగినంత నీరు ఇస్తుండాలి. చాలా ప్రాంతాల్లో నారు 6 అంగుళాల సైజు నుంచి 10 అంగుళాల సైజు వచ్చినప్పుడు మాత్రమే ఊడ్పు/నాట్లు వేస్తుంటారు. నాట్లు వేసిన 7 రోజులకు.. చనిపోయిన మొక్కల స్థానంలో మళ్లీ నాట్లు వేయాలి.

ప్రధాన పొలాన్ని ఊడ్పుకు ముందు 20 రోజుల నుంచి దఫ దఫాలుగా వారానికి ఒకసారి దుక్కి దున్ని, చదును చేసుకోవాలి. ఎకరాకు 3 నుంచి 5 టన్నుల పశువుల ఎరువు వెయ్యాలి. నాట్లతో పాటుగా వివిధ రకాల జీవన ఎరువుల (బ్యాక్టీరియాల)ను ఇవ్వాలి. మొక్కల మధ్య 20 సెం.మీ. దూరం ఉండేలా వరి నాట్లు వేయాలి. మధ్యలో కాలి బాటలు తీయాలి. గట్లపై నువ్వుల విత్తనాలను చల్లుకుంటే నువ్వుల పువ్వులు ఎనాగరస్ అనే కీటకాన్ని ఆకర్షించటం ద్వారా తెల్లదోమ నివారణ జరుగుతుంది.

సేంద్రియ వరి సాగులో చిన్న, పెద్ద రైతులకు అనువైన ఉత్పాదకాల పట్టిక

వివరణ	చిన్న రైతులకు అనువైన ప్రాచీన పద్ధతులు	పెద్ద రైతులకు అనువైన ఆధునిక పద్ధతులు
1వ రోజు విత్తనశుద్ధి	బీజామృతంతో విత్తన శుద్ధి చేయాలి	హ్యూమిక్ యాసిడ్, బవేరియా, మెటారైజియం, సూడోమోనాస్
10వ రోజు పిచికారీ	జీవామృతం + పంచగవ్య + పుల్ల మజ్జిగ	మీనామృతం + సూడోమోనాస్+ తౌడు కషాయం
12వ రోజు ఎరువు	ఘనజీవామృతం	ఘనజీవామృతం / వర్మీకంపోస్టు + హ్యూమిక్ ఆసిడ్
20వ రోజు సస్యరక్షణ	ఆగ్నేయ అస్త్రం + జీవామృతం + మొలకల ద్రావణం	మీనామృతం + బేవేరియా, మెటారైజియం + వెర్టిసీలియం పిచికారీ చేయాలి.
ఊడ్పు అనంతరం 22వ రోజు స్ప్రే	పంచగవ్య + అగ్ని అస్త్రం + పుల్ల మజ్జిగ	మీనామృతం+బవేరియా +మెటారైజియం+ వెర్టిసీలియం + కొబ్బరి నీరు పిచికారీ చేయాలి. కాండం తొలిచే పురుగుకు ల్యూర్ పెట్టాలి లేదా ట్రైకోగ్రామా కార్డులు పెట్టాలి లేదా తూజా 200 (హోమియో) పిచికారీ చేయాలి.
25వ రోజు ఊడ్పు	ఘనజీవామృతం 1 టన్ను / 1 ఎకరం + వేప పిండి 200 కిలోలు/ఎకరం	ఘనజీవామృతం 1 టన్ను/ 1ఎ + బ్యాక్టీరియాలు, ఎన్‌పికె, బవేరియా, మెటారైజియం బాక్టీరియాలు.
25 రోజులకు	కలుపు తీయాలి.	కలుపు తీయాలి.
35 రోజులకు	మొలకల ద్రావణం + ఆగ్నేయ అస్త్రం + ఇంగువ కషాయం లేదా పుల్ల మజ్జిగ పిచికారీ చేయాలి.	మీనామృతం, సోయాబీన్, పెసలు మొలకల ద్రావణం, సూడోమోనాస్, బవేరియా, మెటారైజియం, వెర్టిసీలియం పిచికారీ చేయాలి.
40 రోజులకు	కలుపు తీయాలి.	కలుపు తీయాలి.
45 రోజులకు	మొలకల ద్రావణం + వేప గింజల కషాయం	మీనామృతం + నేల వేము కషాయం + ఉలవల కషాయం
45 రోజులకు	ఘనజీవామృతం 500 కిలోలు/1 ఎకరం	ఘనజీవామృతం 500 కిలోలు / 1 ఎకరం
65వ రోజు పిచికారి	మొలకల ద్రావణం + ఇంగువ కషాయం + పసుపు దుంపల కషాయం + ఆగ్నేయ అస్త్రం	మీనామృతం + సూడోమోనాస్ + వెర్టిసీలియం + వావిలాకు కషాయం
80వ రోజు పిచికారీ	మొలకల ద్రావణం + పుల్ల మజ్జిగ + దశపర్ణి కషాయం	మీనామృతం + సూడోమోనాస్ + వెర్టిసీలియం + బవేరియా



● జీవామృతం

మోతాదు ఎంత?

● ఎకరం పంటకు సగటున 100-120 లీ. నీటిని పిచికారీ చేయాలి ● మీనామృతాన్ని నారుమడిపై లీ. నీటికి 5 ఎం.ఎల్., పైరు ఎదిగిన దశలో లీ. నీటికి / 10ఎం.ఎల్. చొప్పున కలిపి పిచికారీ చేయాలి ● బవేరియాను లీ. నీటికి /10 గ్రా. కలిపి పిచికారీ చేయాలి ● మెటారైజమ్ లీ. నీటికి/10 గ్రా. వాడాలి ● హ్యూమిక్ యాసిడ్ కిలో విత్తనాలకు/10 గ్రా. వాడాలి. ● కిలో నేల వేము పొడిని 100 లీ. నీటిలో కలిపి కషాయం తయారు చేయాలి ● 1500 గ్రా. వావిలాకు పొడిని కషాయం చేసుకొని 100 లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి ● ఎకరానికి రకానికి ఒక కిలో చొప్పున జీవన ఎరువులు వాడాలి ● లీ. నీటికి 10 ఎం.ఎల్. కొబ్బరి నీరు కలపాలి ● పంచగవ్య నారుమడిలో పిచికారీకి లీ. నీటికి 5 ఎం.ఎల్. కలపాలి. పైరు ఎదిగే దశలో పిచికారీకి లీ. నీటికి 20 ఎం.ఎల్. కలపాలి ● అర కేజీ ఇంగువతో ద్రావణం చేసుకొని వంద లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి ● 200 గ్రా. పసుపును కషాయం చేసుకొని వంద లీ. నీటితో కలిపి పిచికారీ చేసుకోవాలి ● 2 కిలోల మొలకలతో ద్రావణం చేసుకొని వంద లీ. నీటితో కలిపి పిచికారీ చేసుకోవాలి ● 6 లీ. పుల్ల మజ్జిగను వంద లీ. నీటితో కలిపి పిచికారీ చేయాలి. ● ఆగ్నేయ అస్త్రం తయారీలో మిర్చి, అల్లం, వెల్లుల్లిలను అర కిలో చొప్పున తీసుకొని నూరి కషాయం తయారు చేసి వంద లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

(ఇతర వివరాలకు.. సుబ్రహ్మణ్యం రాజు మొబైల్: 76598 55588)

నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్

సాగుబడి
అశ్లేష కార్తె: ఆగస్టు 17 వరకు
మఖ: 18 నుంచి



● థార్ ఎడారిలో సాగవుతున్న మొలకగడ్డి

ఎడారిలో ఆశల మొలక

ప్రపంచంలోనే అత్యధిక పాలను ఉత్పత్తి చేస్తున్న మన దేశంలో పచ్చిగడ్డి లభ్యత 11 శాతం తక్కువగా ఉందని భారతీయ గడ్డి నేలలు, పశుగ్రాస పరిశోధనా సంస్థ లెక్కగట్టింది. భూతాపం ప్రమాదకరమైన రీతిలో పెరుగుతున్న ప్రస్తుత కాలంలో పచ్చిగడ్డి సాగుకు హైడ్రోపోనిక్స్ పద్ధతి చక్కని ప్రత్యామ్నాయంగా మారుతోంది. ఈ పద్ధతిలో తక్కువ స్థలంలో, పది శాతం నీటితోనే ఏడాది పొడవునా మొలక గడ్డిని పెంచుకోవచ్చు. మొలక గడ్డిని పాడి ఆవులు, గొర్రెలు, మేకలకు మేపటం మన రాష్ట్రాల్లోనే కాదు.. రాజస్థాన్‌లోని థార్ ఎడారి ప్రాంత పశుపోషకులను సైతం ఆకర్షిస్తోంది. అక్కడ ఏడాదిలో రెండు నెలలే వర్షం పడుతుంది. మండు వేసవిలో ఎండ వేడి 120 డిగ్రీల సెల్షియస్‌కు చేరుతుంటుంది. అటువంటి క్లిష్ట పరిస్థితుల్లో జీవించే థార్ ప్రాంత రైతులు, సంచార పశుపోషకులు స్వచ్ఛంద సంస్థలు, స్టార్టప్‌ల తోడ్పాటుతో ఇటీవల హైడ్రోపోనిక్ మొలక గడ్డి సాగు చేపట్టారు. సునాయాసంగా నాణ్యమైన పాల దిగుబడితో పాటు ఆదాయాన్ని పెంచుకుంటున్నారు.



● మొలకగడ్డి వేస్తున్న మహిళారైతు పలు హేమారామ్

స్వచ్ఛంద సంస్థలు, స్టార్టప్‌లు ఎడారి ప్రాంత రైతులు, పశుపోషకుల కోసం హైడ్రోపోనిక్ మొలక గడ్డిని పెంచే షెడ్లను నెలకొల్పుతున్నాయి. రైతులే వాటిలో మొక్కజొన్నలు, గోధుమలను నానబెట్టి, వర్టికల్ గార్డెన్ మాదిరిగా అనేక దొంతర్లలో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ ట్రేలలో మొలక గడ్డిని పెంచుతున్నారు. సాధారణంగా పొలంలో పచ్చి గడ్డిని పెంచడానికి 2 నెలలు పడుతుంది. మొలక గడ్డి 8 రోజుల్లో పెరుగుతుంది. ముఖ్యంగా పది శాతం నీటితోనే ఈ గడ్డి పెరగటం థార్ ఎడారి ప్రాంత రైతులు, పశుపోషకులకు ఉపయుక్తంగా మారింది.

స్వచ్ఛంద సంస్థ ఉర్ముల్ సీమంత్ సమితి, డిజర్ట్ రిసోర్స్ సెంటర్‌తో కలసి హైడ్రోగ్రీన్స్, బహుళ నేచురల్స్ స్టార్టప్‌లు మొలక గడ్డి ఉత్పత్తి యూనిట్లను థార్ ఎడారి గ్రామాల్లో ఏర్పాటు చేస్తుండటంతో కొందరు మహిళా రైతులు హాయిగా ఊపిరిపీల్చుకుంటున్నారు. బహుళ నేచురల్స్ వీరి వద్ద నుంచి దేశీ ఆవు పాలను, ఒంటె పాలను సేకరించి, విలువ జోడించి ఆన్‌లైన్‌లో విక్రయిస్తోంది. వెయ్యి మంది పాడి రైతులు, 4 వేల మంది పశుపోషకులు తమ ఆవులు, మేకలకు మొలక గడ్డిని మేపుకుంటూ ఏడాది పొడవునా స్థిరమైన ఆదాయం పొందుతున్నారు.

పశుపోషణ కోసం గొడ్డు చాకిరీ చేసే మహిళా రైతులకు మొలక గడ్డి అందుబాటులోకి రావటం గొప్ప ఊరటనిస్తోంది. మొలక గడ్డి మేపుతో దేశీ ఆవు పాల దిగుబడి మూడింట ఒక వంతు పెరగడంతో పాటు, నాణ్యత కూడా పెరిగిందని రాజస్థాన్‌లోని ఘంటియాలి గ్రామానికి చెందిన దళిత మహిళా పశుపోషకురాలు 'పలు', ఆమె భర్త హేమారామ్ సంతోషంగా చెబుతున్నారు. వీరికి 8 ఆవులు, మేకలు ఉన్నాయి. 4 మైళ్ల దూరంలో ఉన్న పొలానికి వెళ్లి గడ్డి కోసుకొని, ఎండలో నెత్తిన పెట్టుకొని మోసుకు రావటం ఆమెకు కనాకష్టంగా ఉండేది. రెండేళ్ల క్రితం ఇంటి పక్కనే మొలకగడ్డి ఉత్పత్తి యూనిట్‌ను ఏర్పాటు చేసుకున్నాక ఆ బాధ తప్పింది. మిగులు గడ్డిని, గోధుమ గడ్డి పొడిని అమ్ముతూ ఆదాయం పొందుతుండటం విశేషం.

దూడలకు పెట్టే కాన్సంట్రేట్ మిక్చర్ దాణాను 75% తగ్గించి మొక్కజొన్న మొలక గడ్డిని మేపటం వల్ల మంచి ఫలితం కనిపించిందని బికనెర్ వెటరినరీ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.కె. ధురియా అన్నారు. హైడ్రోపోనిక్ మొలక గడ్డి వల్ల మేకల్లో జీర్ణశక్తి, పెరుగుదల బాగుందని సౌదీ అరేబియాలోని కింగ్ సౌద్ యూనివర్సిటీ అధ్యయనంలో వెల్లడైంది. మొలకగడ్డి యూనిట్ ఏర్పాటుకు రూ. 18 లక్షల నుంచి 25 లక్షల వరకు ఖర్చవుతోంది. అయితే, ఇసుక తుపాన్లకు మొలకగడ్డి షెడ్లు దెబ్బతినటం వల్ల నష్టం జరుగుతోంది.

అందుకని, ముందు షిప్పింగ్ కంటెయినర్లలో మొలకగడ్డి ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేయటమే దీనికి పరిష్కారమని బహుళ నేచురల్స్ భావిస్తోంది. లక్షల ఖర్చుతో కూడిన పని కావటంతో రైతులను బృందాలుగా ఏర్పాటు చేసి మొలకగడ్డి యూనిట్లను నెలకొల్పితే మేలు. అయితే, రూ. 17.500 ఖర్చుతో చిన్నపాటి మొలకగడ్డి యూనిట్లు ఏర్పాటు చేసుకోవచ్చని హైడ్రోగ్రీన్స్ స్టార్టప్ చెబుతోంది.

బయోచార్‌తో సేంద్రియ ఇంటిపంటల సాగుపై శిక్షణ

సేంద్రియ ఇంటిపంటల సాగుపై పట్టణ/నగర వాసులపై ఆసక్తి పెరుగుతోంది. బయోచార్ (బొగ్గుపొడి) కలిపిన మట్టి మిశ్రమంతో టెర్రస్ గార్డెన్లు, పెరటి తోటలు, బాల్కనీలలో కూరగాయల పెంపకంపై ఈ నెల 24, 25 తేదీల్లో హైదరాబాద్ మలకపేటలోని న్యూలైఫ్ ఫౌండేషన్ శిక్షణ ఇవ్వనుంది. మిగులు పంట దిగుబడులను సోలార్ డ్రయ్యర్‌తో ఎండబెట్టే విధానం కూడా వివరిస్తామని న్యూలైఫ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శివ షిండే తెలిపారు. వివరాలకు.. 81210 08002.

17న అమలాపురంలో ప్రకృతి సేద్యంపై శిక్షణ

శ్రీనివాస సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 17న కోనసీమ జిల్లా అమలాపురంలోని (ముక్తేశ్వరం– కొత్తపేట రోడ్డు) శ్రీసత్యనారాయణ గార్డెన్స్‌లో ప్రకృతి వ్యవసాయంపై నిపుణులు విజయరామ్ రైతులకు అవగాహన కల్పిస్తారని నిర్వాహకులు నిమ్మకాయల సత్యనారాయణ తెలిపారు. ప్రవేశం ఉచితం. ముందుగా పేరు నమోదు చేసుకోవాలి. వివరాలకు.. 64091 11427 (సా. 3 గం. నుంచి 6 గం. వరకు మాత్రమే).